రజాకార్లను చీల్చి చెండాడిన సమర యోధుడు

# "గట్టుపులి మురళి"

ఎమెస్కో

భవానీ సాహిత్య వేదిక, కరీంనగర్

సౌజన్యంతో

# గట్టుపులి మురళి

1921వ సంవత్సరంలో గట్టెపల్లి గ్రామంలో రాజేశ్వర్–లక్ష్మీబాయి గర్భాన మూడవ సంతానంగా జన్మించిన పిల్లవాడికి "మురళీధర్ రావు" అని నామకరణం చేశారు. చకచకా ఎదిగి ఐదవ ఏట పాఠశాలలో ప్రవేశించాడు మురళి.

మొదటి నుండి చాలా చురుకైన పిల్లవాడిగా పేరు తెచ్చుకున్నాడు. తరగతిలో అందరిలో మా ప్రథమ స్థాయిలో నిలిచేవాడు. చిన్ననాటి నుండే తెగువ, తెంపరితనం, వేగం వంటి లక్షణాలతో నాయకత్వం కూడా సొంతమైంది. అక్కయ్యలు రంగుబాయి, లలితాబాయి అంటే ఎంతో ఆదరం, గౌరవం కూడా.

తన తర్వాత చాలా ఏళ్ళకు జన్మించిన తమ్ముడు పురుషోత్తం రావు అంటే మురళికి ప్రాణం. గట్టెపల్లిలో పెద్ద త్రిశాల భవంతి, తన తాతయ్య పెద్దపులిని హతమార్చినందుకు ప్రభుత్వం బహుమతిగా ఇచ్చిన భూమి, సౌకర్యవంతమైన జీవితాన్ని ఇచ్చింది.

కానీ, అకస్మాత్తుగా తండ్రి మరణించటంతో కుటుంబ భారం తల్లి లక్ష్మీబాయి మీద పడింది. గట్టెపల్లి, ఊటూరు గ్రామాలలోని భూముల వ్యవసాయం బాధ్యతను స్వీకరించింది ఆమె. నలుగురు పిల్లల పెంపకం కూడా లక్ష్మీబాయి ధైర్యంగా చూసుకునేది.

బాల్యం నుండే నాయకత్వ లక్షణాలు కలిగి అతి చురుకుగా ఉండే మురళీధర్ రావును భరించలేక ఇంట్లోనుండి పంపించివేసింది మా నాయనమ్మ. ఐనా, మురళి చదువులో ఎప్పుడూ ముందుండేవాడు. ఇవి మా నాయనమ్మ చెప్పిన విషయాలు. అప్పటినుండి పెద్దవాళ్ళు లేక మా తండ్రి స్నేహితులు లేక వివిధ గ్రామాల్లోని పరిచితులు తెల్పిన వివరాలు ఆధారంగా మా బాపుగారి జీవితంలోని కొన్ని సంఘటనల్ని మీ ముందుంచటానికి ప్రయత్నిస్తాను. మరెన్నో సంఘటనలు పోలీస్ స్టేషన్లపై దాడులు వంటి వివరాలు నాకు తెలియవు.

ఎందుకంటే, అటువంటి సంఘటనలన్నీ నేను పుట్టకముందు జరిగినవేనని మీకు సవినయంగా తెలియజేస్తున్నాను. ఇవన్నీ వాస్తవాలేనని, కల్పితం కాదని మీకు హామీ ఇస్తున్నాను. అంత గొప్పవ్యక్తి కొడుకుగా నేను గర్విస్తున్నాను.

బుధజన విధేయుడు

**సంపత్‌కుమార్ శ్రీవత్స**

## 1. పాఠ్యపుస్తకంలోని నైజాం బొమ్మను...

1948కి ముందు ముద్రించిన పాఠ్యపుస్తకాల్లో ముందు పేజీలో నిజామ్ ఫోటో ముద్రించబడేది. ప్రతి విద్యార్థి మొదటి పేజీలోని ఫోటోకు సలాం చేసి పాఠ్యాంశాల్లోకి వెళ్ళేవాళ్ళు.

దీన్ని ప్రతిరోజూ గమనిస్తున్న మురళికి అదేమీ నచ్చలేదు "అనల్ మాలిక్" నినాదమూ నచ్చలేదు.

ఒకరోజు పాఠశాలలో విద్యార్థులందరి ముందర పాఠ్యపుస్తకాల్లోని నిజాం నవాబ్ ఫోటోల్ని ముక్కలు ముక్కలుగా చించిపడేశాడట. ఆ విషయం కాస్త ముదిరిస్ (ఉపాధ్యాయుడు) మరియు సదర్ ముదిరిస్ (ప్రధానోపాధ్యాయుడు)ల దృష్టికి వెళ్ళింది.

ఉపాధ్యాయ బృందం మురళిని పిలిచి దండించబోయారు. దానికి ఆ విద్యార్థి తిరగబడటంతో సర్కారు దృష్టికి తీసుకెళ్ళారు. అలా మొదలైంది మురళీధర్ తిరుగుబాటు ప్రస్థానం.

(ఈ విషయం మా నాయనమ్మ నాకు పూసగుచ్చినట్టు వివరించింది.)

"బానిసత్వమంటే భగభగా మండేను,
నైజాము బొమ్మను చించి ముక్కలుగా చేసేను
బాల్యం నుండియే ఘోరాలు నచ్చక
తిరుగుబాటలు పట్టి జట్లు కట్టే మురళి"

## 2. వరంగల్‌లో వాయుస్తంభన విద్య నేర్చుకోవటం

మానకొండూర్ గ్రామంలో ఉంటున్న మురళి ఉన్నత విద్యకోసం వరంగల్ వెళ్ళి రావల్సి వచ్చేదట. అలా పాఠశాలకు వెళ్ళే మధ్యలో మురళి అతని స్నేహితులు ఒక విచిత్రాన్ని చూడాల్సి వచ్చింది.

వెళ్ళే దారిలో రోడ్ పక్కన ఒక చింతచెట్టు ఉంది. ఎవరో ఒక యోగి ఆ చెట్టు ఎక్కి చిట్టచివరన పక్కకు తిరిగి పడుకుని ఉన్నాడట.

దారిన వెళ్ళే వాళ్ళంతా ఆ యోగిని చూసి ఆశ్చర్యపోతూ వెళ్ళిపోతున్నారట. మురళీధర్ మాత్రమే అలాగే చూస్తూ కూర్చుండిపోయాడట. తన మిత్రులంతా పాఠశాలకు వెళ్ళిపోయారట.

మురళీధర్ మాత్రం తదేకంగా, ఆ యోగి గాలిలో తేలినట్టుగా ఎలా పడుకున్నాడని ఆలోచిస్తూ సాయంత్రం వరకూ ఉండిపోయాడట. దాదాపు ఐదు గంటల ప్రాంతంలో చెట్టుదిగి కిందికి వచ్చిన యోగి తననే రెప్పవాల్చకుండా చూస్తున్న మురళిని అడిగాడట.

"ఏంటిరా అబ్బాయీ! పొద్దటి నుండి ఇక్కడే ఉన్నావు ఎందుకురా?"

"గురూజీ! మీరు ఆ చిటారు కొమ్మలపైన ఎట్లా పడుకున్నారో తెల్సుకుందామని ఇక్కడే ఉన్నాను"

"ఆహాఁ.. శభాష్ ! అసలు నీకేం కావాలి?"

"మీరు అలా తేలికైపోయే విద్య నాకు నేర్పాలంతే" అంటూ పట్టుబట్టాడట మురళి.

అప్పుడు సంతోషించిన ఆ యోగి, తనకు తెల్సిన వాయుస్తంభన తదితర విద్యల్ని కొద్దిరోజుల్లో మురళిని నేర్పించి, ఆశీర్వదించాడట.

"పట్టుబట్టిన మురళి
పట్టువదలక నిలిచి
యోగ విద్యలెన్నో
నేర్చుకున్నాడురా!"

## 3. పులితో పోరాటం

నేను డిగ్రీ చదివే రోజుల్లో మా బాపుగారి బాల్యమిత్రుడు హనుమాన్‌సింగ్ కాక మా ఇంటికి వచ్చి కొద్దిరోజులు గడిపి వెళ్ళాడు. కాక నాకు చెప్పిన ఒక భీకర ఉదంతాన్ని తెలియజేస్తాను.